

ఆంధ్రజ్యోతి



నంద్యాల
జిల్లా వార్తలు 5
బుధవారం 9 జూలై 2025


త్రివర్ణ శోభితమైన శ్రీశైలం డ్యాం

జలమే దైవం!



'రాయలేలిన రాయలసీమను రతనాల సీమగా మారుస్తాం. సీమలో జలవనరులను పెంచి రైతాంగాన్ని ఆదుకుంటాం. పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో రెండు దేవాలయాలు ఉన్నాయి. ఒకటి మల్లన్న స్వామి.. రెండు ప్రాణాధారమైన శ్రీశైలం జలాశయం. నీళ్లు ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. జలం లేకపోతే కష్టమే. ఒక్కమాటలో చెప్పాలంటే జలమే దైవం..'

- సీఎం నారా చంద్రబాబు నాయుడు



గంగమ్మ తల్లికి సారె సమర్పిస్తున్న సీఎం చంద్రబాబు

- సీమను రతనాల సీమగా మారుస్తాం
- పక్కాగా సూపర్-6 హామీల అమలు
- పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- పండ్లతోటల పెంపకానికి సబ్సిడీలు
- ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- శ్రీశైలం నుంచి గేట్లెత్తి నీటి విడుదల
- కృష్ణా జలాలకు జలహారతి
- మల్లన్న సేవలో సీఎం

నంద్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేనివిధంగా రాయలసీమలో అనేక సదుపాయాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామన్నారు. ప్రసుత్తం ఆహారపు అలవాట్లు మారాయని.. అందుకు తగినట్టుగా పండ్లకు డిమాండ్ పెరిగిందన్నారు. ఆదిశగా రాయలసీమలో గతంలో మాదిరిగా 90శాతం సబ్సిడీతో డ్రిప్ సదుపాయం కల్పించి పండ్ల తోటల పెంపకం పెంచుతామన్నారు. శ్రీశైలంలో మంగళవారం సీఎం చంద్రబాబు పర్యటించారు. ముందుగా శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. ముందుగా ఆయన సాక్షి గణపతిని దర్శించుకున్నారు. తర్వాత ప్రధాన ఆలయం వద్దకు సీఎం రాగానే అధికారులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభస్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి నమస్కరించి శ్రీశైల మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, అర్చకులు సీఎంను ఘనంగా సత్కరించి, ఆలయ జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన రోడ్డు మార్గం ద్వారా సున్నిపెంటకు చేరుకున్నారు. అక్కడ శ్రీశైలం జలాశయంలో కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చి, గంగమ్మ తల్లికి సారెను సమర్పించారు. అనంతరం శ్రీశైలం రిజర్వాయర్ నాలుగు గేట్లను ఎత్తి కృష్ణా జలాలను దిగువన సాగర్‌కు విడుదల చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు సున్నిపెంటలోని ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ స్థానికులు, రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గోదావరి జలాలతో రాయలసీమను సస్యశ్యామలం చేస్తామన్నారు. పోలవరం కుడి కాలువతోనే నేటికి సీమకు నీళ్లు వస్తున్నాయన్నారు. కృష్ణా డెల్టాకు గోదావరి నీళ్లు 120 టీఎంసీలు వాడి.. ఆ మిగులు జలాలను సీమకు ఇస్తున్నామని గుర్తు చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఏపీకి పోలవరం ఒక వరం అన్నారు. అంతేకాకుండా తెలుగు గంగ, కేసీ కెనాల్, ఎస్ఆర్‌బీసీ, నగరి, గాలేరు,

మిగతా 6లో...



గో సేవలో సీఎం







నాలుగు గేట్ల ద్వారా దిగువకు కృష్ణమ్మ



నారా చంద్రబాబునాయుడును ఆశీర్వదిస్తున్న వేదపండితులు



సీఎంకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే, ఆలయ అధికారులు

నల్లపురెడ్డి వ్యాఖ్యలు దుర్మార్గం

- వైసీపీ నాయకుల తీరు మారాలి
- మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



డోన్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమైనవని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి వ్యక్తిగత జీవితంపై ప్రసన్నకుమార్‌రెడ్డి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. గతంలో కూడా వైసీపీ నాయకులు సీఎం చంద్రబాబు సతీమణిని, పార్టీలోని మహిళా నేతలను కూడా అనేక రకాలుగా దూషించి వారిని మానసికంగా కృంగదీశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకుల తీరు మారకపోతే 2029 ఎన్నికల్లో 11 సీట్లు కాస్త ఒక్క సీటుకు పరిమితం కావడం ఖాయమని ఆమె హెచ్చరించారు. ఇప్పటికైనా మహిళలను దూషించడాన్ని వైసీపీ నాయకులు మానుకోవాలని హితవు పలికారు.

సాధారణ వ్యక్తిలా..!



శ్రీశైలం పర్యటనకు వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సాధారణ వ్యక్తిలా భక్తులతో మమేకమయ్యారు. శ్రీశైలానికి వచ్చిన భక్తులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వ పనితీరును తెలుసుకున్నారు. సెక్యూరిటీ, వ్యక్తిగత సహాయకులను దూరంగా ఉంచి కాసేపు స్థానికులు, మల్లన్న భక్తులతో ముచ్చటించారు. ప్రభుత్వం సరిదిద్దుకోవాల్సిన లోపాలు ఉంటే చెప్పాలంటూ ప్రజలను అడిగారు. ఈ సందర్భంగా ఓ టీస్టాల్ వద్దకు వెళ్లి టీ తాగారు.

- నంద్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి)

సుంకేసులకు జలశోభ



- క్రస్ట్‌గేట్లు దాటి తుంగభద్ర పరుగులు
- బ్యారేజీకి 61 వేల క్యూసెక్కుల వరద
- 21 గేట్లెత్తి శ్రీశైలానికి 63,264 క్యూసెక్కులు విడుదల
- జల అందాలు వీక్షించి పరవశిస్తున్న ప్రకృతి ప్రేమికులు

తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతోంది. సుంకేసులు బ్యారేజీ జల అందాలు సంతరించుకుంది. ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో సుంకేసుల వద్ద సందడి నెలకొంది. తుంగభద్ర అందాలను వీక్షించేందుకు నగర వాసులు పెద్ద ఎత్తున రైల్వే బిడ్జి, నేషనల్ హైవే, సంకల్ బాగ్ ప్రాంతాలకు చేరుకుంటున్నారు. సెల్ఫీలతో సందడి చేస్తున్నారు. ఎగువన ఆర్డీఎస్ ఆనకట్టపై వరద పోటెత్తింది. మంత్రాలయం రాఘవేంద్రుడి సన్నిధానం చెంత పరుగులు పెడుతోంది. కన్నడ రాజ్యంలో తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల దాటి 61,145 క్యూసెక్కుల వరద కర్నూలు వైపు పరుగులు పెడుతోంది.

కర్నూలు, జూలై 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సంయుక్త జలాశయం తుంగభద్ర డ్యాం ముందస్తు వరదలతో పదేళ్ల రికార్డు సొంతం చేసుకుంది. గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, పూర్తి స్థాయి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. గతేడాది 19వ గేటు కొట్టుకుపోవడం, గేట్లు పటుత్వం తగ్గిపోవడంతో డ్యాం సేఫ్టీ నిపుణుల సూచన మేరకు 80 టీఎంసీలే నిల్వ చేయాలని టీబీపీ బోర్డు నిర్ణయించిన సంగతి తెలిసిందే. మంగళవారం 51,500 క్యూసెక్కులు వరద కొనసాగుతుండగా, 75.93 టీఎంసీలు నిల్వ చేసి 21 క్రస్ట్‌గేట్లు ఎత్తి 61,145 క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. కర్నూలు జిల్లా కౌతాళం మండలం మేళిగనూరు చెంత తెలుగింట అడుగు పెడుతుంది. ఆర్డీఎస్ ఆనకట్ట వరద పరవళ్లతో పోటెత్తింది. మంత్రాలయం రాఘవేంద్రస్వామి క్షేత్రం దాటి నందవరం, సి.బెళగల్ మండలాలు మీదుగా సుంకేసుల బ్యారేజీ చేరుకుంది. బ్యారేజీకి 61 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సామర్థ్యం 1.20 టీఎంసీలే. దీంతో 21 గేట్లెత్తి 63,264 క్యూసెక్కులు దిగువన శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. కర్నూలు నగరం దాటి సంగమేశ్వరం చెంత తుంగభద్రమ్మ కృష్ణమ్మ జలఒడిలో సంగమం అవుతోంది. సుంకేసుల బ్యారేజీ వద్ద పెద్దగా నీటి నిల్వ లేకపోయినా.. విశాలంగా వరద ప్రవహిస్తుండడంతో

మిగతా 6లో...

రాజోలికి భారీ వరద

చాగలమర్రి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద రెండు నెలల క్రితం నీరు లేక వెలవెలబోయింది. మంగళవారం ఎగువ నుంచి ఆనకట్టకు కుందూ ద్వారా వరద నీరు చేరి జలకళ సంతరించుకుంది. పోతిరెడ్డిపాడు, బనకచర్ల వద్ద ప్రజాప్రతినిధులు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో ఎస్కెప్ చానల్, సంతజూటూరు నుంచి కుందూకు నీరు రావడంతో రాజోలి ఆనకట్ట వద్ద 2 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆనకట్ట వద్దగల కేసీకెనాల్ గేట్లను మూసివేసి కడప జిల్లా వైపు గల కుందూనదికి 5 గేట్లను ఎత్తి నీరు విడుదల చేసినట్లు కేసీకెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. కుందూకు నీరు రావడంతో ఆనకట్ట వద్ద జలకళ సంతరించుకుంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేస్తామని అన్నారు. ఆనకట్టకు నీరు రావడంతో ఆయకట్టు రైతులు కేసీకెనాల్ కింద వరి సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.



నాడు నీరు లేక వెలవెలబోతున్న రాజోలి ఆనకట్ట



నేడు రాజోలి ఆనకట్ట వద్ద పొంగి ప్రవహిస్తున్న వరద నీరు



డోలు మేళాలతో స్వాగతం





ప్రాజెక్టు వద్దకు చేరుకున్న రైతులు, ప్రజలు, నాయకులు



టెంకాయ కొడుతున్న సీఎం



సీఎంకు తిలకం పెడుతున్న అర్చకుడు





సీఎంకు స్వాగతం పలుకుతున్న నంద్యాల కలెక్టర్ రాజకుమారి, మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి

జలమే దైవం!

5వ పేజీ తరువాయి

హంద్రీనీవా కింద ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. కులం, మతం, ప్రాంతం అడ్డు వస్తే ప్రజలకు ఎలాంటి మంచి జరగదన్నారు. మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. సున్నిపెంటకు రాగానే.. తల్లులు, చిన్న పిల్లలతో సహా విక్టరీ సింబల్ చూపిస్తుంటే తనకు ఎంతో సంతోషం వేసిందన్నారు. గత పాలకులు ఎవరైనా నవ్వితే తిట్టేవారు.. కొట్టేవారన్నారు. కానీ ఇప్పటి పాలకులు నవ్వించే వారని గుర్తు చేశారు.

భూగర్భ జలాలను పెంచుకుందాం

సంక్షేమం.. అభివృద్ధి దిశగా సాగాలంటే నీటి సంపద మరింత పెంచుకోవాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. గతంలో సాగునీటి సంఘాలు, డ్వాక్రా, విద్యాకమిటీలను తానే తీసుకొచ్చానన్నారు. రాష్ట్రంలో 6,047 సాగునీటి సంఘాలు, 267 పంపిణీ కమిటీలు, 58 ప్రాజెక్టు కమిటీలున్నాయన్నారు. ఈ కమిటీలతో త్వరలో అమరావతిలో ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేస్తామన్నారు. ఎక్కడికక్కడ భూగర్భ జలాలను సైతం పెంచుకునే విధంగా చైతన్య పరుస్తామన్నారు. రైతులకు పీఎం కుసుమ్ పథకం కింద సోలార్ పంపుసెట్లు కూడా అందజేస్తామన్నారు.

సూపర్-6 హామీలపై..


ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తామని చంద్రబాబు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నెలకు రూ.4వేలు పింఛన్ ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రూ.వెయ్యి పెంచేందుకు ఐదేళ్ల సమయం తీసుకుందన్నారు. తల్లికి వందనం పథకం విజయవంతమైందన్నారు. ఈ నెలలో రైతులకు అన్నదాత సుఖీభవ జమ చేస్తామన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. అనేక మంది పేదల ఆకలి తీర్చడానికి 204 అన్నక్యాంటీన్లు పెట్టామన్నారు. భవిష్యత్‌లో అన్ని దేవాలయాల్లోనూ నిత్య అన్నదాన సత్రాలు ఏర్పాటు చేస్తామన్నారు.

సీఎం రాకతో సందడి

శ్రీశైలం జలాశయం నీటి విడుదల నేపథ్యంలో సీఎం చంద్రబాబు రాకతో.. శ్రీశైలంలో సందడి వాతావరణం నెలకుంది. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం పెద్దఎత్తున శ్రీశైలానికి తరలివచ్చారు. సున్నిపెంటలోని హెలిప్యాడ్ నుంచి ఆలయం.. జలాశయం వరకు జనాలు బారులుదీరారు. వృద్ధులు, మహిళలు, యువత సీఎం చంద్రబాబుకు అభివాదం చేశారు. ఇదిలా ఉండగా ముందుగా సీఎం సున్నిపెంటలో హెలిప్యాడ్ దిగగానే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

పటిష్ట బందోబస్తు

సీఎం చంద్రబాబు శ్రీశైలం పర్యటన విజయవంతమైంది. ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం 3.25 గంటల వరకు సీఎం శ్రీశైలంలోనే ఉన్నారు. ఇదే క్రమంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం 3.40 గంటలకు సీఎం హెలిప్యాడ్ ద్వారా అమరావతికి వెళ్లారు. చంద్రబాబు వెంట రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, నంద్యాల కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్త జయసూర్య, భూమా అఖిలప్రియ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఆర్డీఓ చల్లా విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి ప్రసాదం స్వీకరిస్తున్న సీఎం



చంద్రబాబుతో మంత్రి నిమ్మల



స్వాగతం పలుకుతున్న నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా



హోమం వద్ద పూజలు చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు



జల హారతి ఇస్తున్న సీఎం..



ప్రాజెక్టు వద్దకు వస్తున్న నారా చంద్రబాబునాయుడు



పెద్ద పులి చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

హిట్ అండ్ రన్ కేసులపై ప్రత్యేక చర్యలు తీసుకోండి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి



హిట్ అండ్ రన్ కేసులపై ప్రసంగిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న హిట్ అండ్ రన్ కేసులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి కోరారు. మంగళవారం స్థానిక న్యాయ సేవా సదన్ భవన్‌లో హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా స్థాయి మానిటరింగ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసులలో బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు అధికారులు కృషి చేయాలని, ఈ కేసులను నివారించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన రెవెన్యూ, ట్రాన్స్‌పోర్ట్, మెడికల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కర్నూలు జీజీహెచ్‌లో ఉద్యోగాలు

43 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పోస్టులకు నోటిఫికేషన్

కర్నూలు హాస్పిటల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న 43 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాది పాటు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉండే ఈ పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేశామన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచామన్నారు. దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య (ఈ నెల 13న సెలవు దినం మినహా) ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఫిజియోథెరపీస్టు-2, స్పీచ్ థెరపీస్టు-2, సి.ఆర్మ్ టెక్నీషియన్-2, ఓటీ అసిస్టెంట్లు-2, ఈసీజీ టెక్నీషియన్లు-2, డయాలసిస్ టెక్నీషియన్లు-2, ఆడియోమెట్రి టెక్నీషియన్లు-1, ఔట్ సోర్సింగ్ పోస్టుల్లో జనరల్ డ్యూటీ అటెండర్-8, ఎంఎన్‌వోలు-11, ఎఫ్ఎంవోలు 11 పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు.

నేడు సార్వత్రిక సమ్మె

కర్నూలు న్యూసిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు బుధవారం దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాలు ఉదయం నుంచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనలు తెలుపుతాయి. నగరంలోని ప్రధాన కూడళ్లు, ఆటోలు, బస్సులను బంద్ చేయించాలని కార్మిక నాయకులు విజ్ఞప్తి చేశారు.

రేపు మద్దిలేటి స్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

బేతంచెర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో ఈ నెల 10న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో రామాంజ నేయులు మంగళవారం తెలిపారు. వేడుకల్లో మహాలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌ను వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పలు రకాల ఫలాలు, పుష్పాలతో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పలు విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి శ్రీలలితా సహస్ర నామ కుంకుమార్చన ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ అక్కా తమ్ముళ్లు అసాధ్యులు

- కత్తి పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైన గ్రామీణ విద్యార్థులు
- రికార్డు స్థాయిలో బంగారు, స్వర్ణ పతకాలు
- జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన ఆశ్రిత, అజిత్



జాతీయ స్థాయికి ఎంపికైన అక్క, తమ్ముడు

చాగలమర్రి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈ అక్కా తమ్ముళ్లను చూస్తే ముచ్చటేస్తుంది. ఇద్దరికీ కత్తి పోటీల్లో తిరుగు లేదు. చాగలమర్రి గ్రామంలో పుట్టి పెరిగి కత్తి పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. చేతుల నిండా పతకాల పంట పండిస్తున్నారు. తల్లిదండ్రులు ఇద్దరు పీడీలు. వారిని ఆదర్శంగా తీసుకున్న పిల్లలు బంగారు, స్వర్ణ పతకాలను సాధించారు. గ్రామంలోని చంద్ర ఓబుళరెడ్డి, ఆశాజ్యోతిరెడ్డి ఇద్దరు ప్రభుత్వ పీడీలు. చంద్ర ఓబుళరెడ్డి కడప జిల్లా రాజుపాలెం మండలం వెలువలి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విధుల నిర్వహిస్తున్నారు. ఆశాజ్యోతిరెడ్డి చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. కుమార్తె ఆశ్రిత రెడ్డి చాగలమర్రిలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కుమారుడు అజిత్‌రెడ్డి 7వ తరగతి చదువుతున్నాడు. వీరు రాష్ట్ర, జాతీయస్థాయి పెన్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపుతూ పతకాలు కైవసం చేసుకుంటున్నారు.

సాధించిన పతకాలు ఇవే..

2022లో ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్వర్ణం సాధించి ఆశ్రితరెడ్డి జాతీయస్థాయికి ఎంపికైంది.

2022 ఆగస్టులో మహారాష్ట్రలోని నాసిక్ పట్టణంలో మినీ నేషనల్ పోటీల్లో ప్రశంసా పత్రాన్ని దక్కించుకుంది.

2022లో 66వ స్కూల్‌గేమ్స్‌లో పాల్గొని రాష్ట్రస్థాయిలో స్వర్ణ పతకం సాధించింది.

2023లో 67వ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికైంది.

2023లో ఛత్తీస్‌ఘడ్‌లోని జగదల్‌పూర్‌లో జరిగిన జాతీయస్థాయి పెన్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రశంసా పత్రం దక్కించుకుంది.

అండర్ 14 బాలికల విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ క్రీడల్లో 28న కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థాయంలో రాణించి జాతీయస్థాయికి ఎంపికైంది.

2024 నవంబరు నెలలో జమ్ముకాశ్మీర్‌లో జరిగిన 68వ జాతీయ స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం కైవసం చేసుకుంది.

వలంపిక్స్‌లో దేశం తరపున పాల్గొనాలనే లక్ష్యంతో ప్రస్తుతం చెన్నైలో ప్రత్యేక శిక్షణ పొంది పోటీలకు సిద్ధంగా ఉంది.

జాతీయస్థాయికి ఎంపికైన అజిత్‌రెడ్డి

ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో స్వర్ణ బంగారు పతకాలను కైవసం చేసుకొని అజిత్‌రెడ్డి తోటి విద్యార్థుకు ఆదర్శంగా నిలిచాడు.

విజయవాడలో 29న జరిగిన అండర్12 స్టేట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని బంగారు పతకం సాధించాడు.

2025 జూలై 5న అండర్ 12 నేషనల్ చాంపియన్‌షిప్ మహారాష్ట్రలోని నాసిక్ పట్టణంలో జరిగే ఫెన్సింగ్ పోటీలకు సిద్ధమయ్యాడు.

2024 జూన్‌లో ఒడిసాలోని కటక్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపాడు.

2024లో నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

2024 నవంబరులో జమ్ముకాశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు.

2023లో కాకినాడాలో రాణించి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు.

2022లో ఒంగోలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి ఎంపికయ్యారు.

మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి ప్రశంసా పత్రాన్ని పొందారు.

భారతదేశం తరపున వలంపిక్స్‌లో పాల్గొని బంగారు పతకం సాధించడమే లక్ష్యమని అజిత్‌రెడ్డి అంటున్నాడు.

- స్వర్ణ, బంగారు పతకాలు సాధిస్తున్న ఆశ్రితరెడ్డి, అజిత్‌రెడ్డిలను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, హెచ్ఎం స్మిత, వ్యాయామ ఉపాధ్యాయులు, ఎస్టీయూ, పీఆర్టీయూ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

సుపరిపాలనతోనే అభివృద్ధి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అరాచక శక్తులను ఉసిగొల్పి అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారన్నారు. ప్రస్తు తం జరుగుతున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిర్వహిస్తున్న ఇంటింటి కార్యక్రమంలో వారి ఆరాచకాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు జిల్లా అధ్యక్షుడిని కలిశారు. నామినేటెడ్ పదవుల్లో తమకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం రుద్రవరం గ్రామంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీపీవీ సుబ్బయ్య, సురేష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

డీఏపీ, యూరియా కొరత లేకుండా చర్యలు

● డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు

నందికొట్కూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా, డీఏపీ కొరత లేకుండా రైతులను ఆదుకుంటామని డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్ అన్నారు. మంగళవారం నందికొట్కూరు మార్కెట్ యార్డుకు వచ్చిన ఎరువుల బస్తాలను ఆయనతో పాటు నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సకాలంలో డీఏపీ, యూరియాలను అందిస్తామన్నారు. అందుకు సంబంధించిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనలు, అపోహలు పెట్టుకోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, నందికొట్కూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సుధాకర్ యాదవ్, టీడీపీ నాయకులు సర్వోత్తమరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు జలశోభ

5వ పేజీ తరువాయి



నిండు కుండలా తుంగభద్ర డ్యాం

ఆ అందాలను వీక్షించేందుకు ఇటువైపు కర్నూలు జిల్లా, అటు వైపు జోగులాంబ గద్వాల జిల్లాలకు చెందిన పలు గ్రామాల ప్రకృతి ప్రేమికులు తరలి రావడంతో సందడి నెలకొంది.

14న కేసీ కెనాల్‌కు సాగునీరు

తుంగభద్ర వరదతో సుంకేసుల పోటెత్తినా కేసీ కాలువకు సాగునీరు ఇవ్వడం లేదు. అయితే.. కర్నూలు జిల్లాలో 3,763 ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. దీంతో ఈ నెల 14న కేసీ కాలువకు సాగునీరు విడుదల చేయాలని సోమవారం కలెక్టర్ పి. రంజిత్‌బాషా అధ్యక్షతన జరిగిన ఐఏబీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆ దిశగా కేసీ కెనాల్ ఇంజనీర్లు సన్నహాలు చేస్తున్నారు. కాలువ గేట్లు మరమ్మతులు చేస్తున్నారు. నగరం పరిధిలో కేసీ దుర్గంధం వెదజల్లుతోంది. నీరు విడుదల చేస్తే మురుగు కొట్టుకుపోయి దుర్గంధం నుంచి ఉపశమనం కలుగుతుందని నగరవాసులు పేర్కొంటున్నారు.

రేపు ఎల్లెల్సీకి..

జిల్లాలో టీబీపీ ఎల్లెల్సీ కింద ఈ ఏడాది ఖరీఫ్‌లో 35 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని, ఈ నెల 10 నుంచి తుంగభద్ర డ్యాం నుంచి కాలువకు సాగునీరు విడుదల చేయాలని ఐఏబీ సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు టీబీపీ బోర్డుకు జిల్లా ఇరిగేషన్ ఇంజనీర్లు ఇండెంట్ ఇచ్చారు. టీబీ డ్యాం నుంచి ఏపీ సరిహద్దుకు చేరడానికి ఐదారు రోజులు పడుతుందని అంచనా. 18వ తేదీ నుంచి ప్రధాన కాలువ నుంచి పంట కాలువలకు సాగునీరు ఇచ్చేందుకు ఇంజనీర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఆయకట్టు రైతులు వరి, మిరప, పత్తి.. వంటి పంటలు సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

పేరెంట్స్ కమిటీలకు రూ.3.30 కోట్లు విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్టేట్ ప్రాజెక్టు ఆదేశాల మేరకు కాంపోజిట్ గ్రాంట్స్ 1406 పాఠశాలలకు రూ.3.30 కోట్లు విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ మంగళవారం తెలిపారు. 983 పాఠశాలలకు గ్రాంట్ వారి పీఎఫ్ఎంఎస్ అకౌంటులో జమ అయ్యాయని అన్నారు. మిగతా 423 పాఠశాలల అకౌంట్స్ ఇన్‌యాక్టివ్ ఉండటం వల్ల వారి ఖాతాలో జమ కాలేదన్నారు. వారి అకౌంట్లు ఈ నెల 9వ తేదీ ఉదయం 11 గంటలలోపు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యూనియన్ బ్యాంకులో కలిసి ఖాతాలను యాక్టివేట్ చేసుకున్న గంటలోపే వారి ఖాతాల్లో కాంపోజిట్ గ్రాంట్స్ జమ అవుతుందన్నారు. ఇలా జమ అయిన మొత్తం నుంచి పది శాతం ఈ నెల 10న జరిగే మెగా పీటీఎంకు వినియోగించుకోవాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

అప్పుల కోసం తిప్పలు

పంట రుణాల కోసం పరపతి సంఘాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

- ఖరీఫ్‌లో రూ.500 కోట్ల రుణాలు ఇవ్వాలని డీసీసీబీ లక్ష్యం
- 19 సంఘాలకు మాత్రమే రుణాలిచ్చే అర్హత
- 80 సంఘాలకు అర్హత లేదంటున్న అధికారులు
- రికవరీ కోసం సీఈవోలను పరుగులు పెట్టిస్తున్న అధికారులు





కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం



ఈ రైతు పేరు మల్లన్న. పత్తికొండ నియోజకవర్గంలోని క్రిష్ణగిరి గ్రామం. ఈ ఖరీఫ్‌లో తనకున్న ఐదెకరాల పొలంలో వేరుశనగ పంటను సాగు చేసేందుకు పెట్టుబడికోసం చేయని ప్రయత్నం అంటూ లేదు. ప్రాథమిక వ్యవ సాయ పరపతి సంఘం చుట్టూ ప్రతిరోజూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. గతంలో ఈ క్రిష్ణగిరి సంఘంలో తీసుకున్న రుణాలు సక్రమంగా వసూలు కాలేదని సహకార బ్యాంకు తేల్చింది. బకాయిలను రికవరీ చేస్తేనే తిరిగి రుణాలు ఇచ్చేందుకు నిధులను కేటాయిస్తామని చెప్పింది. దీంతో సంఘం సీఈవో, సిబ్బంది బకాయిలు రాబట్టేందుకు గ్రామాల వెంట పరుగులు పెడుతున్నారు. బకాయిల రికవరీ ఎప్పుడు పూర్తవుతుంది? ఎప్పుడు తమకు రుణం మంజూరు చేస్తారు? అని ఈ రైతు ఎదురు చూస్తున్నాడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మూడు లక్షల మంది రైతులు ఖరీఫ్ సాగు కోసం పడిగాపులు కాస్తున్నారు.

కర్నూలు అగ్రికల్చర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం రైతులకు పంట సాగు కోసం సహకార సంఘాల ద్వారా రూ.500 కోట్ల రుణాలు ఇవ్వాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు నిర్ణయించారు. గత సంవత్సరం రైతులకు ఇచ్చిన రుణ బకాయిలను సకాలంలో చెల్లించిన రైతులకే మొదట ప్రాధాన్యత జాబితాలో చేర్చి ఆ సంఘా లకు నిధులు కేటాయించాలని బ్యాంకు అధికారులు స్పష్టం చేస్తున్నారు. 60 శాతం రుణ బకాయిలు చెల్లించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు మాత్రమే రుణాలు పంపిణీ చేసేందుకు నిధులను కేటాయించే అవకాశం ఉందని అధికా రులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటిదాకా ఉమ్మడి జిల్లాలోని 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో 19 సంఘాలు మాత్రమే రుణబకాయిలు సక్రమంగా చెల్లించిన అర్హత లభించింది. ఇంకా 80 సంఘాలు 60శాతం రుణ బకాయిలను సాధించలేక వెనుకబడి పోయాయి. ఈ సంఘాలకు నిధులు విడుదల చేయా లంటే లక్ష్యం మేరకు బకాయిలు వసూలు చేయాల్సిందేనని, వెంటనే గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పించి బకాయిలు వసూలు చేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో సహకార సంఘాల సీఈవోలు సిబ్బంది గ్రామాలకు పరుగులు తీస్తున్నారు. అయితే ఒత్తిడి తెచ్చినా రైతులు బకాయిలు చెల్లించేందుకు నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నా రని సంఘాల అధికారులు వాపోతున్నారు. కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన ఒక రైతు రుణ బకాయిలను వెంటనే చెల్లించాలని ఒత్తిడి తెస్తే తన వల్ల కాదని, తనకే పంట సాగు కోసం రుణం ఇవ్వాలని అర్థించడంతో సహకార సంఘం అధికారులు మరో దారిలేక వెనుదిరిగి వచ్చారని సమాచారం.

రుణం ఇచ్చే సమయంలో రికవరీలా...! రైతుల ఆవేదన

ఉమ్మడి జిల్లాలోని 99 సహకార సంఘాల ద్వారా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో నాలుగున్నర లక్షల మంది రైతులు సాగు రుణాలు తీసుకుంటున్నారు. ఇతర వాణిజ్య బ్యాంకులతో పోటీ పడి సహకార కేంద్ర బ్యాంకు రైతులకు రుణాలు అందిస్తుండటంతో రైతులంతా సహకార సంఘాల ద్వారానే రుణాలు తీసుకునేందుకు క్యూ కడుతున్నారు. మామూలుగా పంట కాలం ముగిసిన తర్వాత పంట ఉత్పత్తులను అమ్మిన సమయంలో సహకార సంఘాల అధికారులు, సిబ్బంది రైతుల నుంచి రుణ బకాయిలను వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అయితే ఈసారి పంట అమ్ముకున్న రైతులు వివిధ కారణాల వల్ల బకాయిలు చెల్లించలేక పోయారు. దీంతో రికవరీ 80 సంఘాలకు లేకుండా పోయింది. కేవలం 19 సహకార సంఘాలు మాత్రమే 60 శాతానికి మించి బకాయిలను రాబట్టగలిగాయి. సాగు కోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలు చెల్లించి అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తోందని, తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్న ప్రాథమిక వ్యవసాయ సంఘాల నుంచి ప్రస్తుతం రుణాలు అందుతాయో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రికవరీ శాతాన్ని 60 నుంచి కొంత సడలింపు ఇస్తే చాలా సంఘాలకు రైతులకు రుణాలు ఇచ్చే అర్హత సాధించే అవకాశం ఉందని సీఈవోలు అంటున్నారు.

19 సంఘాలకే రుణాలు ఇచ్చేందుకు అర్హత



వర్షాభావం, గిట్టుబాటు ధర అందని కారణంగా ఉమ్మడి జిల్లాలోని రైతులు చాలామంది రుణ బకాయిలు చెల్లించ లేకపోతున్నారు. దీంతో రైతులకు రుణాలు ఇచ్చిన ప్రాథమిక వ్యవసాయ పరిపతి సంఘాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కేవలం 19 సంఘాలకు మాత్రమే రుణాలు ఇచ్చే అర్హత ఉన్నట్లు గుర్తించాం. మిగిలిన 80 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు త్వరిత గతిన రుణ బకాయిలు వసూలు చేయగలిగితే రైతులందరికీ పంట రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. **- వెంకటకృష్ణ, డీసీవో**

ఎస్సీ విద్యార్థులు పోస్టల్ ఖాతా తెరవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి రెండో విడత తల్లికి వందనం ప్రభుత్వం విడుదల చేస్తుందని, దీనికి ఎస్సీ విద్యార్థులు పోస్టల్ ఖాతా తెరవాలని ఎస్సీ సంక్షేమ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి రాధిక అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులు తప్పనిసరిగా పోస్టల్ బ్యాంకు అకౌంటు తెరవాలన్నారు. ఈ ఖాతాను ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవడం ద్వారా మాత్రమే తల్లికి వందనం పథకం ప్రయోజనాలు పొందుతారన్నారు. ఈ సమాచారాన్ని విద్యాశాఖ అధికారులు విద్యార్థులు, కళాశాలల యజమాన్యాలు గమనించాలని పేర్కొన్నారు.

ప్రకృతి సేద్యం చేయండి

- ఈ సంవత్సరం లక్ష్యం 1,32,514 ఎకరాల్లో సాగు
- జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ మాధవి



కర్నూలు అగ్రికల్చర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతులు లాభాల బాట పట్టాలంటే ప్రజలకు నాణ్యమైన ఆహార పంట ఉత్పత్తులు అందుబాటులోకి రావాలంటే ప్రకృతి సేద్యం ద్వారానే పంటల సాగు జరగాలని కర్నూలు జిల్లా ప్రకృతి వ్యవసాయం మేనేజర్ మాధవి తెలిపారు. మంగళవారం కర్నూలు నగరంలోని జడ్‌బీఎన్‌ఎఫ్ కార్యాలయంలో మేనేజర్ మాధవి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 53,456 మంది రైతులతో 1,32,514 ఎకరాల్లో ప్రకృతి సేద్యం ద్వారా పంటల సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించి లక్ష్యాన్ని చేరుకుంటామని స్పష్టం చేశారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకొని ప్రకృతి సేద్యం చేస్తే సాగు ఖర్చులు చాలా వరకు తగ్గిపోతాయన్నారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

కోవెలకుంట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం మండల పరిధిలోని సౌదరిదిన్నె గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సూర్య చంద్రుడు(36) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడేవాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా కడుపు నొప్పి తగ్గలేదు. అయితే మంగళ వారం ఉదయం కడుపు నొప్పి అధికం కావడంతో పొలంలోకి వెళ్లి విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బంధువులు సూర్యచంద్రున్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన భీమునిపాడు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్యాంబాబు (58) అనే వ్యక్తి ఆదివారం రాత్రి మోటారు బైకుపై కోవెలకుంట్ల నుంచి భీమునిపాడుకు వెళ్తుండగా అదుపు తప్పి బైకుపై నుంచి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య గ్రేసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో బాలుడు..

ఆదోని రూరల్, జూలై 8 ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపెండేకల్లు గ్రామానికి చెందిన దుర్గప్రసాద్(16) పాముకాటుతో మృతి చెందాడు. వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం ఇంట్లో నిద్రిస్తుండగా బాలుడిని పాము కాటేసింది. కుటుంబ సభ్యులు ఆదోని ఏరియాసుపత్రిలో చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. అయితే బాలుడు కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. తండ్రి చిన్న రంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి..

ఎమ్మిగనూరు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలదొడ్డి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన మేరకు.. గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన వృద్ధుడు మృతిచెందడంతో దహన సంస్కారాల్లో పాల్గొనేందుకు నందవరం మండలం కనకవీడు గ్రామానికి నరసింహులు (45) బైక్‌పై గువ్వలదొడ్డికి వెళ్తున్నాడు. గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో నరసింహులు కిందపడి గాయాలపాలయ్యాడు. సమాచారం మేరకు చేరుకున్న 108 సిబ్బంది కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఎమ్మిగనూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోలుకోలేక యువకుడు..

ఎమ్మిగనూరు మండలం సంత నాగులాపురం గ్రామానికి చెందిన ఏసేపు (24) కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన మేరక.. వారం రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

నందవరం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన బీమన్న(22) బైక్ అదుపుతప్పి మంగళవారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు.. బీమన్న గ్రామంలోని రాఘవేంద్ర సర్కిల్ వద్ద పెట్రోల్ పోయించుకుని ఇంటికి వస్తుండగా కల్లుపెంట వద్ద కుక్క అడ్డురావడంతో బైక్‌నుంచి ఎగిరి రోడ్డు పక్కనే ఉన్న రాయిపై పడ్డాడు. తల బలంగా కొట్టుకోవడంతో తీవ్రంగా రక్త స్రావమై మృతి చెందాడు. చుట్టుపక్కల వారు పరిగెత్తి వెళ్లేసరికే మృతి చెందాడు. మృతుడికి ఏడాదిన్నర క్రితం వివాహం కాగా, భార్య లింగేశ్వరి, మూడు నెలల కుతూరు వర్షిత ఉంది.



బీమన్న(ఫైల్)

గుర్రపు డెక్కలో చిక్కుకుని బర్రెలు మృతి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కుందూనదిలో గుర్రపు డెక్కలో చిక్కుకుని 11 బర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన పట్టణంలోని మూలసాగరం సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మూలసాగరం కాలనీకి చెందిన శ్రీనివాసరెడ్డి మంగళ వారం బర్రెలు మేపేందుకు కుందూనదిలోకి వెళ్లాడు. నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో బర్రెలు గట్టు వైపు పరుగులు తీశాయి. ఈక్రమంలో ఒకవైపు ఉన్న గుర్రపు డెక్కలో చిక్కుకున్నాయి. స్థానికులు అగ్నిమాపకశాఖ కార్యాలయానికి ఫోన్ చేయడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఒక బర్రె, ఒక దూడను కాపాడారు. మిగిలిన 8బర్రెలు, మూడు దూడలు గుర్రెపు డెక్కలో చిక్కుకుని మృతిచెందాయి. పాడి పైన ఆధారపడి జీవిస్తున్న శ్రీనివాసరెడ్డికి చెందిన బర్రెలు ఒక్కసారిగా చనిపోవడంతో లబోదిబోమంటున్నాడు. తనను ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాడు.



బర్రెల మృతికి కారణమైన గుర్రపు డెక్క

బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ బి.నవ్య



బీఎల్‌వోలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జేసీ నవ్య

కల్లూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలని పాణ్యం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదేశించారు. మంగళవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో కల్లూరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమానికి జేసీ నవ్య హాజరై మాట్లాడారు. ఓటర్ల నమోదులో ఫారం-6,7,8 ఎప్పటికప్పుడు తీసుకుని క్షేత్రస్థాయిలో విచారించి అప్ డేట్ చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సరిపడా వసతులు, ఇబ్బందులను తమ దృష్టికి తీసుకురావాలని బీఎల్‌వోలకు ఆదేశించారు. 1,200 ఓటర్లు దాటిన పోలింగ్ స్టేషన్లు 60 ఉన్నాయని, అందులో 46 పోలింగ్ కేందాలను పక్క స్టేషన్‌కు బదిలీ చేసే అవకాశం ఉండగా మిగిలిన 14 పోలింగ్ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా వచ్చిన బీఎల్‌వోలకు ఈనెల 8వ తేదీ నుంచి 12 తేదీ వరకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోజుకు 50 మంది చొప్పున శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం 30మార్కులకు అసెస్మెంట్ పరీక్ష నిర్వహించి బీఎల్‌వోలకు సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని జేసీ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు విష్ణుప్రసాద్, ఎలక్షన్ డీటీ అనూరాధ ఎంపీడీవో జి.నాగ శేషాచలరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన కలెక్టర్



మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు రూరల్ జూలై 8(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం పి.రుద్రవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం కలెక్టర్ పి.రంజిత్ బాషా పరిశీలించారు. ఈసందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం గ్రామ శివా రులో జరుగుతున్న ఉపాధి పనుల గురించి కలెక్టర్ కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతంలో వసతు లు కల్పిస్తున్నారా లేదా అని కలెక్టర్ కూలీ లను అడిగి తెలుసుకు న్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి గ్రామంలో రైతులు, కూలీలు బాగుండాలని అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంద న్నారు. పాలన పారదర్శకంగా జరిగేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్ర మంలో జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల వద్ద పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషిద్ధం

- ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్



కర్నూలులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల వద్ద వంద గజాల దూరంలో సిగరెట్, పొగాకు సంబంధిత పదార్థాల విక్రయం నిషేధించినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం పోలీసు అధికారులతో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. పోలీసు అధికారులు తమ పరిధిలోని విద్యాసంస్థలను సందర్శించి వంద గజాల్లోపు టీషాపులు, పాన్ షాపులు, కిరాణం అంగళ్లలో సిగరెట్లు, ఖైనీ గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు అమ్మడం నిషేధమని షాపుల నిర్వాహకులకు తెలిపారు. విద్యాసంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులను విక్రయించే యజమానులకు సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం (సీవోటీపీఏ) యాక్ట ప్రకారం జరిమానా విధించారు. యువత భవిష్యత్తును కాపాడేందుకు ఈ తరహా నిషేధిత పదార్థాల వినియోగాన్ని నిరోధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సీవోపీటీఏ చట్టం ప్రకారం షాపులను సీజ్ చేసి షాపు యజమానులపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ

- ఏపీ వీఆర్వో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మౌలిబాషా



మాట్లాడుతున్న మౌలిబాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని ఏపీ వీఆర్వో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మౌలిబాషా హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్‌డబ్ల్యూఎస్ రేషనలైజేషన్‌లో వీఆర్వో గ్రేడ్-1 పోస్టులను తగ్గించవద్దని, అలాగే ప్రోటోకాల్ విధుల నుంచి రెవెన్యూ శాఖ సిబ్బందిని మినహాయిస్తే రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలగదని అన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ విషయంపై రెవెన్యూ మంత్రి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టులను అర్హులైన గ్రేడ్-1, గ్రామ రెవెన్యూ అధికారులతో భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సరాజు, శ్రీధర్, తిరుమల్‌రెడ్డి, బుద్ధకవి, నారాయణరెడ్డి, రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు వైసీపీ, కాంగ్రెస్ నేతల నివాళి





వైఎస్సార్ విగ్రహానికి, చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నంద్యాల జిల్లా వైసీపీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

కల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ, వైసీపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి 29వ వార్డు షరీన్‌నగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సంగాల సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శ్వేతారెడ్డి. నారాయణరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జె.లక్ష్మీ నరసింహాయాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కృపానందం వృద్ధాశ్రమంలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. కేక్ కట్, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రజాక్‌వలి, పఠాన్ అభిఖాన్, అనంతరత్నం, సుంకన్న, మద్దిలేటి, జనార్ధన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సబ్సిడీని వినియోగించుకోండి

మిడుతూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగులో రైతులు వందశాతం సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో దశరథరామయ్య అన్నారు. మంగళవారం మిడుతూరు గ్రామానికి చెందిన మురళి అనే రైతు పొలంలో ఎంపీడీవో, ఏపీవో నాగమ్మ ఆధ్వర్యంలో ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉద్యాన పంటలు సాగు చేసేందుకు ఆసక్తికల ఐదు ఎకరాలలోపు రైతులు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌ను, టీఏను, ఏపీవోను సంప్రదించాలని ఆయన కోరారు. పొలంలో టెంకాయ మొక్కలను నాటారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పశువులకు పచ్చిమేత ఇవ్వండి



రైతులతో మాట్లాడుతున్న ఏడీ వెంకటేశ్వర్లు

బండిఆత్మకూరు జూలై8 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులు తమ పశువులకు పచ్చిమేత ఆహారంగా అందించాలని ఏడీ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మండలంలోని ఏ.కోడూరు, సంతజూటూరు, జి.లింగాపురం గ్రామాల్లో పశుగ్రాస వారోత్సవ సమావేశాలు డాక్టర్లు అనూష, జ్యోత్స్న నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెలుగోడు ఏడీ వెంకటేశ్వర్లు రైతులతో మాట్లాడుతూ పచ్చిగ్రాసం ఇవ్వటంతో పాడి పెరిగి అధికలాభాలు పొందవచ్చన్నారు. పంటసాగు అనంతరం రైతులు పొలాల్లో పిల్లపెసర, జనుము పెంచటంతో పశుగ్రాసంగా, అనంతరం పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సాయిచంద్, రామాంజనే యులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రేపు మెగా పేరెంట్స్ మీటింగ్

ఆత్మకూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనున్నట్లు ఎంఈవో బాలాజీనాయక్ తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేరెంట్స్ మీటింగ్ నిర్వహణ కోసం అన్నిపాఠశాలలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఈకార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌ను జయప్రదం చేయాలని ప్రిన్సిపాల్ సుంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా కళాశాల అభివృద్ధి కోసం ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆత్మకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లను ప్రారంభించకుండా ఉన్నత విద్యా మండలి నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఎం నాయక్, పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ద్యూయల్ డిగ్రీ విధానం అమలు పరుస్తున్నామని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఆచరణలోకి వెళ్లకుండానే రివ్యూ జరిపి సింగిల్ మేజర్ విధానమే కొనసాగిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంటర్ పరీక్షల ఫలితాలు వెలువడి మూడు నెలలు అవుతున్నా అడ్మిషన్లను ప్రారంభించకపోవడం అన్యాయమని అన్నారు. సమావేశంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్ నాయకులు సాయి, ప్రశాంత్, వెంకట్, బాలాజీ తదితరులు ఉన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

కొత్తపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు తెలిపారు. మంగళవారం నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆదేశాల మేరకు మండలంలోని ఎర్రమటం, ముసలిమడుగు, పాతమాడుగుల గ్రామాల్లో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారిగా నెరవేరుస్తుందని వివరించారు. ఈ కార్య క్రమంలో యూనిట్ ఇన్‌చార్జి రహీంఖాన్, బూత్ కన్వీనర్లు రామకృష్ణా రెడ్డి, మిట్టా ఖాదర్‌బాషా, పరమేశ్వరరెడ్డి, శీలం లింగన్న, వెంకటస్వామి, జనసేన నాయకులు ఇక్బాల్ బాషా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీబీఆర్‌కు చేరిన కృష్ణా జలాలు



వెలుగోడు జలాశయానికి కృష్ణాజలాలు

వెలుగోడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (వీబీఆర్)కు కృష్ణాజలాలు చేరాయి. బనకచెర్ల సముదాయం నుంచి వెలుగోడు జలాశయానికి లింక్ చానల్ మీదుగా కృష్ణాజలాలు పరవళ్ళు తొక్కుతున్నాయి. ప్రస్తుతం జలాశయానికి 5500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం జలాశయంలో 259.94 మీటర్ల నీరు నిల్వఉన్నట్లు గంగ అధికారులు తెలిపారు.

పండ్ల మొక్కల పెంపకంలో ఆసక్తి చూపాలి

మహానంది, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నల్లమలలోని గిరిజనులు పండ్ల మొక్కల పెంపకంపై ఆసక్తి చూపాలని ఎంపీడీవో మహమ్మద్ దౌలా తెలిపారు. మంగళవారం చెంచులక్ష్మీ గూడెంలో టెంకాయ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. 21 మంది రైతులకు 23 ఎకరాల్లో టెంకాయ మొక్కలను నాటించినట్లు ఎంపీడీవో తెలిపారు.

గుట్టుగా గుట్కా అమ్మకాలు

- ప్రభుత్వం నిషేధించినా తగ్గని జోరు
- పట్టించుకోని అధికారులు



దుకాణాల్లో విక్రయాలకు ఉంచిన గుట్కా ప్యాకెట్లు (ఫైల్)

ఆత్మకూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గుట్కా విక్రయాలను నిషేధించింది. అయినా గుట్కా విక్రయాల జోరు మాత్రం ఏ మాత్రం తగ్గడంలేదు. నిషేధం ఉన్నప్పటికీ గుట్కా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయల్లా వర్ధిల్లుతోంది. పల్లెల్లో సైతం గుట్కా వ్యాపారం ఊపందుకుందంటే పట్టణాల్లో ఏ రకంగా ఉంటుదో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం వివిధ ప్రచార సాధనాల ద్వారా గుట్కా వినియోగంతో అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న క్షేత్రస్థాయిలో మాత్రం గుట్కా అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సిగరెట్, మద్యం, గుట్కాలు అనారోగ్యాన్ని కలిగిస్తాయని తెలిసినా యువత వాటికి బానిసలుగా మారిపోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈకోవలోనే ఆత్మకూరు ప్రాంతంలోని ఆయా గ్రామాల్లో కిరాణం, పాన్‌షాపుల్లో గుట్కా ప్యాకెట్ల వ్యా పారం రహస్యంగా జరుగుతోంది.

కోట్లలో వ్యాపారం..

ఏడాదిలో గుట్కా వ్యాపారం కోట్లలో జరుగుతున్నట్లు తెలుస్తోంది. గుట్కావాసనను భరించలేని మహిళలు అస్వస్థతకు గురైన సందర్భాలున్నాయి. యువత గుట్కా మత్తులో చిక్కుకొని కొట్టుమిట్టాడుతుంది. గుట్కాలో నికోటిన్ అనే పదార్థం ఉండడంతో ప్రాణానికి ముప్పువాటిల్లే పరిస్థితులున్నాయి. గుట్కా వాడకంతో ఆకలి మందగించి, చిగుళ్లవ్యాధి శరీరంలోని ఏభాగానికైనా క్యాన్సర్ సోకే అవకాశాలు ఉన్నట్లు వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే గుట్కా విక్రయాలను నియంత్రించాల్సిన ఆయాశాఖల అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. పలుచోట్ల వ్యాపారుల వద్ద మామూళ్లు సైతం స్వీకరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం నిషేధించిన గుట్కా విక్రయాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనావుంది.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



రైతు శ్రీనివాసరెడ్డి పొలంలో ఆయిల్ పామ్ మొక్కను నాటుతున్న అధికారులు

కొత్తపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుపై ఉద్యాన శాఖాధికారులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం మండలంలోని దుద్యాల గ్రామంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, ఉద్యానవన శాఖ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఉద్యానవన శాఖాధికారి చందన, మండల వ్యవసాయాధికారి అమీరున్నీసా బేగం మాట్లాడారు. ఆయిల్ పాం స్కీం కింద పంట సాగుచేసే రైతులకు అందించే సబ్సిడీని వివరించారు. ఈ పంట సాగు చేసే రైతులకు నీటి వసతి కలిగి ఉండాలన్నారు. స్థానిక రైతు శ్రీనివాసరెడ్డి పంట పొలంలో ఆయిల్ పామ్ మొక్కను నాటారు. వ్యవసాయ, పతంజలి సిబ్బంది ఉన్నారు.

రాజన్న పాలనలోనే రైతుల సంక్షేమం



స్మృతివనంలో వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

ఆత్మకూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలోనే రైతులకు సంక్షేమ పథకాలు అందాయని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైఎస్ఆర్ 76వ జయంతిని పురస్కరించుకుని ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామ సమీపంలోని వైఎస్ఆర్ స్మృతివనంలో, పట్టణంలోని నంద్యాల టర్నింగ్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శివశంకరరెడ్డి, ఆ పార్టీ నాయకులు సయ్యద్‌మీర్, అంజాద్‌అలీ, అంబాల ప్రభాకరరెడ్డి, తిరుపమరెడ్డి, భాస్కరరెడ్డి, సుల్తాన్, పార్వతీ, మారుబోతుల స్వామి, బాలస్వామి తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి : మండల కేంద్రమైన కొత్తపల్లిలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం కొత్తపల్లి పోలీస స్టేషన్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు అతావుల్లా, నాగన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

బండిఆత్మకూరు జూలై8(ఆంధ్రజ్యోతి): చిరు ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం చేపట్టనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు రత్నమయ్య, రాజు పిలుపునిచ్చారు. మంగళవారం బండిఆత్మకూరు ఆసుపత్రి డాక్టర్ సవితకు ఆశాలతో కలసి వారు సమ్మె నోటీసును అందించారు.

వైద్యులకు సమ్మె నోటీసులు

మిడుతూరు: ఆశావర్కర్లు బుధవారం నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగమణి పేర్కొన్నారు. మంగళవారం తలముడిపి, కడుమూరు పీహెచ్‌సీలో వైద్యాధికారులు మద్దిలేటి, రాజుకు సమ్మె నోటీసులను అందజేశారు. ఆశావర్కర్లు నాగలక్ష్మి, సులోచన, అనిత, పరిమిళ, లక్ష్మిదేవి, రజిత తదితరులు పాల్గొన్నారు.



మితుడూరు: తలముడిపిలో వైద్యాధికారికి సమ్మె నోటీసును అందజేస్తున్న ఆశావర్కర్లు



బండిఆత్మకూరులో ఆశాలతో కలసి డాక్టర్ సవితకు సమ్మె నోటీసును ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలి

ఆత్మకూరు: ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షుడు రణధీర్, ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాలు భారతి, ప్రమీలరాణి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం బైర్లూటి పీహెచ్‌సీ, ఆత్మకూరు అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులకు జూలై 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మె నోటీసులను వారు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వరలక్ష్మి, శాంతి, లింగమ్మ తదితరులు ఉన్నారు.

మిస్సింగ్ కేసులను ఛేదించిన పోలీసులు



చంద్రమ్మను ఆమె తల్లి లింగమ్మకు అప్పగిస్తున్న సీఐ రాము

ఆత్మకూరురూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలో 2023లో నమోదైన రెండు మిస్సింగ్ కేసులను ఆత్మకూరు పోలీసులు ఛేదించారు. వారిని తల్లిదండ్రులకు మంగళవారం అప్పగించినట్లు సీఐ రాము తెలిపారు. వివరాలు.. ఆత్మకూరు మండలం పెచ్చెరువు గూడేనికి చెందిన చంద్రమ్మ అనే గిరిజన మహిళను మండలంలోని ఇందిరేశ్వరం గూడేనికి చెందిన ఓగిరిజనుడితో వివాహం జరిపించారు. అక్కడ భర్తతో కుటుంబ కలహాల నేపథ్యంలో 2023లో ఇంట్లో నుంచి వెళ్ళి పోయింది. అప్పట్లో చంద్రమ్మ తల్లిదండ్రులు లింగమ్మ, చెవిటన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మండలంలోని నల్లకాలువ గ్రామానికి చెందిన ఆశీర్వాదం అనే వ్యక్తి తన కుమారుడు రాజారావు కనబడటం లేదని 2023లో కేసు నమోదు చేశారు. కాగా ఎస్పి ఆదేశాల మేరకు పెండింగ్ లో ఉన్న ఈ కేసులను ఛేదించేందుకు పూనుకున్న ఆత్మకూరు పోలీసులు పెండింగ్‌లో ఉన్న ఆయా కేసుల మీద ఆరా తీసి ఎట్టకేలకు ఆయా కేసులను ఛేదించారు. చంద్రమ్మ అనే గిరిజన మహిళను పెచ్చెరువులో రాజారావును దోర్నాలలో ఉన్నట్లు గుర్తించి మంగళవారం వారిని తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- నందికొట్కూరు ఏడీఏ గిరీష్



నందికొట్కూరు: ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ, ఏవోలు

నందికొట్కూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎరువుల కృత్రిమ కొరత సృష్టిసే చర్యలు తీసుకుంటామని ఏడీఏ గిరీష్ ఎరువుల దుకాణాల యజమానులను హెచ్చరించారు. మంగళవారం పట్టణం లోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మా ట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని నందికొట్కూరు, మిడ్తూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాల్లో ఎరువులు తగినంత అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రాథమిక సహకార సంఘాలకు మరియు ప్రైవేట్ డీలర్ల వద్ద 925.63 టన్నుల యూరియా, 365.8 టన్నుల డీఏపీ, 1547.6 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులు అపోహలకు గురికావద్దని సూచించారు. ఈ తనిఖీల్లో నందికొట్కూరు ఏవో షేక్షావలి పాల్గొన్నారు.

ఎరువులు అందించండి

బండిఆత్మకూరు: సహకార సంఘాల్లో ఎరువులు రైతుల పాస్‌బుక్‌ల ఆధారంగా పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు సూచించారు. మంగళవారం మండలంలోని ఏ.కోడూరు సహకార సంఘంలో ఎరువుల నిల్వలు, పంపిణీ రికార్డులు ఆయన తనిఖీ చేశారు. ఇప్పటి వరకు 224 టన్నుల యూరియా, 99టన్నుల అమోనియా పంపిణీ చేశారన్నారు. మండలంలో 415 టన్నుల యూరియా అందుబా టులో ఉందని, ఎవరూ ఆందళన చెందాల్సిన అవసం లేదన్నారు. రోజుకో గ్రామం చొప్పున పంపిణీ చేస్తారని, రైతులు క్రమ పద్ధతిలో ఉడి ఎరువులు తీసుకుని అధికారులకు సహకరించాలన్నారు. ఏవో పవన్‌కుమార్, సీఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో..

కొత్తపల్లి: మండల రైతాంగానికి యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయాధికారి అమీరున్నిసాబేగం తెలిపారు. మండలంలోని గువ్వలకుంట్ల, కొత్తపల్లిలోని రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏవో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలానికి 20 టన్నుల యూరియా, 30 టన్నుల డీఏపీ ఎరువులు అందుబాటులో ఉంచామని తెలిపారు. వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసులు, నాగశ్రీ, ఇన్సూరెన్స్ కంపెనీ కోఆర్డినేటర్ అరుణ్, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పాములపాడు: మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణ దారులు ఎరువులను అధిక ధరలకు విక్రయస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి మహేశ్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పాములపాడులోని మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎరువుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత సృష్టించరాదని, ఎరువులు కొనాలంటే పురుగుమందులు కొనాలని మెలిక పెట్టరాదని డీలర్లకు సూచించారు.

ప్రభుత్వ బడుల్లో పిల్లల్ని చేర్పించాలి

- డీఈవో జనార్దన్‌రెడ్డి



ఏ. కోడూరులో ర్యాలీలో పాల్గొన్న డీఈవో జనార్దన్‌రెడ్డి

బండిఆత్మకూరు జూలై8 (ఆంధ్రజ్యోతి): తల్లి దండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని డీఈవో జనార్దనరెడ్డి అన్నారు. మంగళవారం ఏఎస్ కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్‌తో కలిసి మండలంలోని ఏ.కోడూరు, బీ కోడూరు గ్రామాల్లోని పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. బోధనా తీరును పర్యవేక్షించారు. విద్యార్థులతో కలసి ర్యాలీలో పాల్గొని గ్రామస్థులకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మోసపు హామీలను ప్రజలకు వివరించాలి

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

నందికొట్కూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి సీఎం చంద్రబాబు మోసపు హామీలను ప్రజలకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు వివరించాలని ఆపార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మాజీ సీఎం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని మార్కెట్‌యార్డు సమీప సర్కిల్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతా రెడ్డి, ఇసాక్‌బాషా పాల్గొన్నారు. చాముండీ ఫంక్షన్‌హాలులో నియోజకవర్గ సమన్వయకర్త ధారసుధీర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఆర్థిక సమస్యలు వంటి వాటి గురించి ప్రజలకు వెళ్లి చర్చించేందుకు 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. పోస్టర్‌ను విడుదల చేశారు.

కేక్ కట్ చేసి..

మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, పార్టీ కార్యకర్తలతో కలిసి నందికొట్కూరు మార్కెట్‌యార్డు సమీప సర్కిల్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. వైసీపీ మైనార్టీ నయాకులు దౌలత్‌భాష, రమణ పాల్గొన్నారు.

హామీల అమలులో..

గడివేముల: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్బీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, మండల వైసీపీ కన్వీనర్ మధుసూదన్‌గుప్త, మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, బండపల్లి రమేష్, మేఘనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

జ్యోతిబసు సేవలు మరువలేనివి




జ్యోతిబసు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అట్టడుగు వర్గాల సంక్షేమానికి పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతి బసు చేసిన సేవలు మరువలేనిదని సీపీఎం సీనియర్ నాయకులు రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఆపార్టీ కార్యాలయంలో జ్యోతిబసు 111వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 23ఏళ్ల పాటు వరుసగా ఒక రాష్ట్రాన్ని పాలించిన ప్రజానాయకుడు జ్యోతిబసు అని కొనియాడారు. ఆ పార్టీ నాయకులు రణధీర్, మాబాషా, సురేంద్ర, నాగేశ్వరరావు, వీరన్న, వలి, గణపతి తదితరులున్నారు.

పండ్ల మొక్కల పెంపకంతో లాభాలు

బండిఆత్మకూరు జూలై8 (ఆంధ్రజ్యోతి): రైతులు పండ్ల మొక్కలు పెంచటంతో లాభాలు పొందవచ్చని ఎంపీడీవో రామకృష్ణవేణి పేర్కొన్నారు. మంగళవారం ఏపీడీ సాంబశివరావుతో కలిసి మండలంలోని పెద్దదేవళాపురం, ఈర్నపాడు, శింగవరం, సోమయాజులపల్లె, బండిఆత్మకూరు, జీసీపాలెం, ఏకోడూరు, బీ కోడూరు గ్రామాల్లో పండ్లతోటల పెంపకం కింద కొబ్బరి మొక్కలు నాటించారు. ఏపీవో వసుధ, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విలువలతో జీవితం గడపాలి



ధార్మిక సమావేశంలో ప్రసంగిస్తున్న శ్రీనివాస రామానుజ దాసు

పాణ్యం, జూలై 8 (ఆంధ్ర జ్యోతి) : ప్రతి మానవుడు విలువలతో కూడిన జీవితం గడపాలని నంబూరు శ్రీకాళి వనాశ్రమం ప్రధానోపన్యాసకులు శ్రీనివాస రామానుజదాసు పేర్కొన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్తు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తమ్మరాజుపల్లెలో ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రామేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాటుచేసిన ధార్మిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి శ్రీమద్రామాయణంలోని ఆదర్శపాత్రలకు అనుగుణంగా జీవించడమే సార్థకమన్నారు. స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పరిషత్తు కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు శాకాంబరి ఉత్సవం

మహానంది, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి గురువారం ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకొని శాకాంబరి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలోతెలిపారు. అమ్మవారికి శాకాంబరి అలంకారంతో ఏర్పాటు చేస్తే దేశం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. వివిధ రకాల కూరగాయలతో పాటు ఆకుకూరలతో అర్చకులు కామేశ్వరీదేవి అమ్మవారితో పాటు ఆలయంను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం ఏర్పాటుచేస్తామని వివరించారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం


సహకార సంఘం కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీడీఎం కార్తీక్

రుద్రవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేస్తున్నట్లు నాబార్డు డీడీఎం కార్తీక్ అన్నారు. మంగళవారం రుద్రవరం సహకార సంఘంలో కంప్యూటరీకరణ స్టేటస్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 54 సహకార సంఘాలు ఉన్నాయన్నారు. రైతుల ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే శిరివెళ్ల సహకార కేంద్ర బ్యాంకు తనిఖీ చేసినట్లు తెలిపారు. రుద్రవరం సహకారసంఘం పరిధిలో రూ. 9.50 కోట్లు టర్నోవర్ ఉందన్నారు. కార్యక్రమంలో మేనేజరు రేణుక, సూపర్‌వైజరు సుబ్బరాయుడు, సీఈవో భాస్కర్ పాల్గొన్నారు.

నేడు పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ

రుద్రవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో బుధవారం పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. శిక్షణలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీరాజ్ ఉద్యోగులు పాల్గొనాలని సూచించారు.

పరిసరాల శుభ్రతతో అంటువ్యాధులు దూరం

శిరివెళ్ల, జూలై 8(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధులు దూరమవుతాయని ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా శిరివెళ్లలోని పీహెచ్‌సీ నుంచి గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణ ద్వారా మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులను అరికట్టవచ్చన్నారు. వైద్యులు ముఖేష్, ఆంజనేయులు, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది రవి ప్రకాష్, సరస్వతి పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవం


బోనాలతో మహిళలు

ప్యాపిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం పెద్దమ్మ బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తే వర్షాలు కురిసి పంటలు సంవృద్ధిగా పండుతాయని నిర్వాహకులు తెలిపారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్యాపిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాంపల్లి గ్రామంలో మొహర్రం సందర్భంగా దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సుందరం డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ మంగళవారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దళితులు ఆందోళన చేశారు. సీఐ వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాల రంగన్న, ఆవుల రామక్రిష్ణ, విజయ్‌కుమార్, వెంకటరాముడు, తిప్పన్న పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డుగా నిలిచిన లారీ

- నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం

కొలిమిగుండ్ల, జూలై 8, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాద్రిపల్లె గ్రామ సమీపంలో మంగళవారం ఓ లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దాంతో అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలో ట్రాఫిక్ నాలుగు గంటల పాటు నిలిచిపోయింది. కనకాద్రిపల్లెకు అంకిరెడ్డిపల్లె నుంచి చింతలాయపల్లె మీదుగా తిమ్మనాయునిపేట రహదారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. లారీ బేరింగ్ విరిగిపోవడమే కారణంగా తెలిసింది. కొలిమిగుండ్ల సీఐ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు, గ్రామస్థులు ప్రత్యేక చొరవ తీసుకొని లారీని తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి..

బేతంచెర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో మద్దిలేటి స్వామి ముఖద్వారం వద్ద ప్రజలపై వీధి కుక్కలు దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. మంగళవారం గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద బడికి వెళ్తున్న విద్యార్థి నితిష్ కుమార్‌పై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. గమనించిన స్థానికులు కుక్కల నుంచి బాలుడిని రక్షించారు. కుక్కల బారి నుంచి తమను, విద్యార్థులను రక్షించాలని అధికారులను ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అందుబాటులో ఉండాలి

సంజామల, జూలై 8(ఆంధ్రజ్యోతి): పాడిరైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు కొండారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కొలిమిగుండ్ల, సంజామల మండలాల పశువైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగప్రాణులకు సత్వర వైద్య సేవలు అందించాలన్నారు. సమావేశంలో పశువైద్య అధికారులు డాక్టర్ క్రిష్ణకుమార్, డాక్టర్ వేమ సులోచన, జేవీఓలు, ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

- డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్


రామక్రిష్ణాపురం కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావుయాదవ్

ప్యాపిలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం లో సుపరిపాలన సాధ్యమవుతుందని డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని రామక్రిష్టాపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొమ్మెమర్రి వెంకటరాముడు, మధుశేఖర్, మాధవరాజు తదితరులు పాల్గొన్నారు.

అవుకు: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు ఐ. ఉగ్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొండమనాయునిపల్లెలో టీడీపీ నాయకులు ఆకుల నాగిరెడ్డి, బనగానపల్లె ఏఎంసీ చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డితో కలసి సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొండమనాయునిపల్లెలో కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

విద్యార్థుల భవితతో చెలగాటం

- అనుమతుల్లేకుండా పాఠశాల, కళాశాల నిర్వహణ
- విద్యాధికారులతో లోపాయికారి ఒప్పందం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

బేతంచెర్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యను వ్యాపారంగా చేసి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది ఓ ప్రైవేటు పాఠశాల, కళాశాల యాజమాన్యం. ప్రభుత్వం, ఉన్నత విద్యాధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్వహిస్తూ ధనార్జనే లక్ష్యంగా కొనసాగుతోంది. పట్టణంలో రీడ్(గ్రేస్) పాఠశాల, కళాశాల యాజ మాన్యం ఉదంతం ఇది. ప్లే క్లాస్ నుంచి ఉన్నత పాఠశాలకు ఉన్నత విద్యామండలి అనుమతులు, కళాశాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాల్సి ఉండగా.. అలాంటివి ఏమీ లేకుండానే డిగ్రీ కళాశాల వరకు తరగతులు నిర్వహిస్తుంది. విద్యాధికారులతో లోపాయికారి ఒప్పందమే ఇందుకు నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ప్రైవేటు పాఠశాల, కళాశాలలో చదివిన విద్యార్థుల తల్లిదండ్రులతో వేలకు వేలు ఫీజులు దండుకుంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆకర్షించే బ్రోచర్లను పంపిణీ చేస్తూ..

2025-26 విద్యా సంవత్సరానికి గానూ విద్యార్థులను తల్లిదండ్రులను ఆకర్షించే బ్రోచర్లు పంపిణీ చేస్తూ కళాశాల యాజ మాన్యం ధనార్జనే ధ్యేయంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణ శివా రులోని నంద్యాల రహదారిలో ఉన్న రీడ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు జూనియర్, డిగ్రీ కాలేజీలకు ఉన్నత విద్యాధి కారులు ఎలాంటి విద్యాశాఖ అధికారులు అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్నారు. పాఠశాల, కళాశాల భవనాలకు నగర పంచాయతీ కూడా అప్రూవల్ లేవు. ఎవరి అనుమతులు లేకుండానే పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నది. ఈ భవనాల్లో విద్యార్థులకు నీటి సౌకర్యం, ఆట స్థలం కూడా అసలేలేదు. అగ్నిమాపక దళం అధికారుల అనుమతి, ప్రాథమిక విద్యాశాఖ అధికారుల అనుమతి కూడా లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలో పాణ్యం జూనియర్ కళాశాలకు ఇంటర్ పరీక్ష కేంద్రం ఒక్కటే తప్ప, ఇంటర్ బోర్డు అనుమతులు లేని రీడ్ జూనియర్ కళాశాలకు ఇంటర్ పరీక్ష కేంద్రంగా ఇంటర్ బోర్డు అధికారులు అనుమతులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఏదీ ఏమైనాప్పటికీ ఓర్వకల్లు మండలంలో ఉన్న బుగ్గ రామేశ్వర డిగ్రీ కళాశాల అనుమతులతోనే పాఠశాలలు, రీడ్ జూనియర్, డిగ్రీ కళాశాలలను యాజమాన్యం నిర్వహిస్తూ తప్పుడు పత్రాలు చూపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిగ్రీ కళాశాల షిఫ్టింగ్ చేసుకోవడానికి వీల్లేదు. ప ట్టణంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు ప్రభు త్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నా కూడా విద్యాశాఖ అధికారులు, ఇంటర్ బోర్డు అధికారులు పట్టించుకోకపోవడం కొసమెరుపు.


బేతంచెర్లలో ప్రభుత్వ అనుమతులు లేని ప్రైవేటు పాఠశాల

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

బేతంచర్లలోని నంద్యాల రహదారిలో ఉన్న రీడ్ కళాశాలకు అనుమతులు లేని విషయంపై 'ఆంధ్రజ్యోతి' డీఐఈవో వివరణ కోరగా.. గతంలో ఆ కళాశాలపై ఏమి జరిగిందో తెలియదు కానీ, తాను సందర్శించి కళాశాలపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని వివరించారు.

● శంకర్‌నాయక్, డీఐఈవో

వైద్యశిబిరం విజయవంతం

బనగానపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం మంగళవారం దివ్యాంగులకు నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైనట్లు దివ్యాంగ విభాగం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ రైస్ ఫాతిమా పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ పరికరాలు ఉచితంగా అందజేసేందుకు నిర్వహించిన వైద్య శిబిరంలో ఐదు మండలాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారన్నారు. దివ్యాంగులకు మంత్రి బీసీ దంపతులు అన్నదాన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. దివ్యాంగులకు సంబంధించిన వివరాలు నమోదు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బనగానపల్లె ఎంపీడీవో నాగరాజు, సిబ్బంది, , తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో పాల్గొన్న దివ్యాంగులు

11న విభిన్న ప్రతిభావంతులకు ఉచిత వైద్య శిబిరం

డోన్ టౌన్: నియోజకవర్గ పరిధిలోని డోన్, ప్యాపిలి, బేతంచర్ల మండలాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులకు, వయోవృద్ధులకు ఉచితంగా ఉపకరణాలు అందించేందుకు ఈ నెల 11న వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి. వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని విభిన్న ప్రతిభావంతులు వినియోగించుకోవాలని కోరారు.

కంచెను తొలగించాలి

- డీఎస్పీకి వినతిపత్రాన్ని ఇచ్చిన నెహ్రూనగర్ కాలనీవాసులు

డోన్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూనగర్‌లోని పార్కులోకి వెళ్లకుండా ఏర్పాటు చేసిన కంచెను తొలగించాలని కాలనీవాసులు, వాకర్లు కోరారు. మంగళవారం డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ నెహ్రూనగర్‌లోని రామసుబ్బయ్య తోటలో ఉన్న పార్కులో తాము ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారమని, సాయంత్రం మహిళలు సేదతీరేందుకు, చిన్నపిల్లలు ఆడుకోవడానికి వచ్చేవారమన్నారు. ప్రస్తుతం ఆ పార్కులో రానీయకుండా కంచె ఏర్పాటు చేశారని, ఈ కంచెను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు మధు, శ్రీనివాసులు, చెన్నయ్య, పురుషోత్తం, వై.శ్రీనివాసులు ఉన్నారు.


డీఎస్పీ శ్రీనివాసులుకు వినతి పత్రం ఇస్తున్న కాలనీవాసులు

ముగిసిన మొహర్రం

దొర్నిపాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా మొహర్రం జరుపుకున్నారు. పీర్లను జన సందోహం మధ్య ఊరేగింపు చేశారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు, మహిళలు తరలివచ్చి ఫతెహాలు చేశారు. ఏఎస్ఐ రంగయ్య ఆధ్వర్యంలో పోలీసుబందోబస్తు నిర్వహించారు.

కొలిమిగుండ్ల: మండలంలోని తిమ్మనాయునిపేట, కనకాద్రిపల్లె గ్రామాల్లో మొహర్రం మంగళవారం ముగిశాయి. తిమ్మనాయునిపేట పీర్ల చావిడిలో ఏర్పాటు చేసిన పీర్లస్వాములకు టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కనకాద్రిపల్లెలో నిర్వహించి న నిమజ్జనం వేడుకల్లో టీడీపీ నియోజకవర్గం సమన్వయకర్త వీఆర్ లక్ష్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంకట మ ల్లారెడ్డి, సర్పంచ్ శివశంకర్, పెద్దిరెడ్డి, చిన్నరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో మంగళవారం మొహర్రం ముగిసింది. వీధుల్లో పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఎస్ఐ మహ్మద్‌రఫీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


దొర్నిపాడులో పీర్ల ఊరేగింపు

పండ్లతోటల సాగుకు వంద శాతం సబ్సిడీ

ఉయ్యాలవాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పండ్లతోటల సాగుకు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ ఇస్తుందని ఎంపీడీవో ఉమా మహేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం మారెమ్మ గుడి వద్ద రైతు పొలంలో కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పున్నెమ్మ, గ్రామ సర్పంచ్ ఓబులేసు, ఉపాధి ఏపీవో హరిక్రిష్ణ, గ్రామకార్యదర్శి జయరామిరెడ్డి, సీఏలు, ఎఫ్ఏలు రైతులు ఉన్నారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్. జంబులదిన్నె గ్రామ మెట్ట వద్ద వెలసిన అభయాంజనేయస్వామికి ఆషాఢ శుద్ధ త్రయోదశి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అర్చకుడు లక్ష్మణస్వామి అభిషేకం చేసి పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కుంకుమార్చన, సింధూర, ఆకుపూజ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఆళ్లగడ్డ, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొటకందుకూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ రూరల్ సూపర్‌వైజర్ పార్వతి మంగళవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌ల గురించి టీచర్లకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అమూల్య, విజయలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు హేమంత్ నాయక్ ఎంపిక

ఆళ్లగడ్డ, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డకు చెందిన హేమంత్ నాయక్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సుబ్బారాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కర్నూలులో జరిగిన అండర్ 14 బాలుర జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీల్లో ఆర్ఆర్ అకాడమీ క్రీడాకారుడు హేమంత్ నాయక్ ఎంపికయ్యాడన్నారు. క్రీడాకారుడిని అకాడమీ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, శేషు అభినందించారు.

జంబలదిన్నెలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే

ఆళ్లగడ్డ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలం జి జంబలదిన్నె గ్రామంలో ఎంపీడీవో నూర్జహాన్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛత సర్వేక్షణ్ సర్వే నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామస్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సర్వే బృందం అధికారులు సందర్శించారు.

కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా ఎల్లగౌడు

డోన్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డోన్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా చిన్న పూజర్ల ఎల్లగౌడు పేరును టీడీపీ అధిష్ఠానం బలపరచడంతో ఉత్కంఠ వీడింది. గతంలో ఎల్లగౌడు సింగిల్ విండో చైర్మన్ రేసులో ఉన్నాడంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి బలం చేకూరింది. ఉత్తర్వులు సొసైటీ బ్యాంకు సంబంధిత అధికారులకు వచ్చాయి. దీంతో పదవి బాధ్యతలు చేపట్టడం, ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఎల్లగౌడు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాడు.

కందిలో అంతర్‌పంటలు సాగు చేసుకోవాలి

కొలిమిగుండ్ల, జూలై 8, (ఆంధ్రజ్యోతి): కందిలో అంతర్ పంటలు సాగు చేసుకోవాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి నాగేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం కొలిమిగుండ్ల శివాలయంలో మీర్జాపురం గ్రామానికి చెందిన రైతులకు కందిపంటపై అవగాహన కల్పించారు. వ్యవసాయ సిబ్బంది నాగరాజు, వనిత పాల్గొన్నారు.

దివంగత సీఎం వైఎస్సార్‌కు ఘన నివాళి

బనగానపల్లె, డోన్, ఆళ్లగడ్డ నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో, గ్రామాల్లో మంగళ వారం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు వైసీపీ, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. అలాగే ఆస్పత్రుల్లో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశా రు. ఆయా కార్యక్రమాల్లో వైసీపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


బనగానపల్లెలో కేక్ కట్ చేస్తున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కాటసాని రామిరెడ్డి


డోన్‌లో వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రధాని మోదీ ఫొటో అందజేత

డోన్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ప్రధాని నరేంద్రమోదీ ఫొటో ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం వైద్యురాలు గ్రేషియాకు మోదీ ఫొటోను అందజేశారు. అలాగే ఆస్పత్రిని శుభ్రం చేసేందుకు కావాల్సిన వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోటరీ భవనంలో హెల్త్ క్యాంపు

డోన్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ 25ఏళ్ల సెలబ్రేషన్స్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజస్థాన్‌కు చెందిన ఆక్యుప్రెజర్, వైబ్రేషన్ డాక్టర్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో డోన్ రోటరీ భవనంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. దాదాపు 100 మందికి చికిత్స చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రమోద్‌కుమార్, ప్రెసిడెంట్ ఎల్ఐసీ శంకర్ గౌడు, సెక్రటరీ బి.మల్లారెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ బి.దశరథరామిరెడ్డిలను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా అధ్యక్షుడు జింకల క్రిష్ణ, సెక్రటరీ సందు బలరాం, క్లబ్, ఇన్నర్‌వీల్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జియారత్


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం పెద్దలు

చాగలమర్రి, జూలై 8 (ఆం ధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చిన్నమకానం వీధిలో వెలసిన లాల్‌స్వామి గ్రామ చావిడి వద్ద మంగళవారం భక్తిశ్రద్ధలతో జియారత్ నిర్వహించారు. గ్రామంలో పదిరోజుల పాటు నిర్వహించిన మొహర్రం ప్రశాంతంగా ముగిసింది. పీర్లను బాక్సుల్లో భద్రపరిచి జియారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్‌ను కమిటీ సభ్యులు సన్మానిం చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడు చక్రం షబ్బీర్, ముల్లారఫీ, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి గుల్లదుర్తిలో..

కోవెలకుంట్ల: మండల పరిధిలోని గుల్లదుర్తి గ్రామంలో బుధవారం నుంచి జియారత్ వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొహ్రారం ముగిసిన మూడోరోజు వేడుకలు ప్రారంభమవుతాయి. బుధ, గురువారాల్లో రెండురోజుల పాటు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి మౌళాళి స్వామి దర్గాలో స్వామివారి దర్గా కమిటీ ప్రత్యేక ఏర్పాటు చేశారు.

225 ఎకరాల్లో పండ్ల తోటల సాగే లక్ష్యం

చాగలమర్రి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది ఉపాధి హామీ ద్వారా 225 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉందని ఏపీవో ఖాసీంసాహెబ్ తెలిపారు. మంగళవారం గొడిగనూరు గ్రామంలో రైతు వెంకటేశ్వర్లు పొలంలో నిమ్మ మొక్కలు నాటారు. ఏపీవో మాట్లాడుతూ వందశాతం సబ్సిడీతో 16రకాల పండ్ల మొక్కలను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాని కోరారు. నాయకులు శేఖర్‌రెడ్డి, రైతులు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

చాగలమర్రి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, పురుగు మందులను, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రంగనేతాజీ హెచ్చరించారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ యూరియా కొరత సృష్టించరాదన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు.

పశుగ్రాస క్షేత్రాలను సద్వినియోగం చేసుకోండి

చాగలమర్రి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం అందించే పశుగ్రాస క్షేత్రాలను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చాగలమర్రిలో పాడి రైతులకు పశుగ్రాసం పెంపకంపై అవగాహన కల్పించారు. పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేయించుకోవాలి

చాగలమర్రి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం జాబితాలో పేర్లు లేని రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేయనుందన్నారు. ఇందుకు జాబితాను తయారు చేసి రైతు సేవా కేంద్రాల్లో ఉంచామని అన్నారు. జాబితాలో పేర్లు లేకుంటే వీఆర్వోలకు దరఖాస్తు చేసుకొని నమోదు చేయించుకోవాలని తెలిపారు.

రైతు సేవా కేంద్రాల్లో అర్హుల జాబితా

శిరివెళ్ల, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను ఉంచినట్లు వ్యవసాయాధికారి సుధాకర్ సూచించారు. శిరివెళ్లలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆయా కేంద్రాల పరిధిలోని రైతులు జాబితాను పరిశీలించుకోవాలన్నారు. పేర్లు లేని రైతులు తమ పొలం వన్‌బీ, ఆధార్ కార్డు జిరాక్సును రైతు సేవా కేంద్రం ప్రతినిధికి అందజేయాలని సూచించారు.

కౌలు రైతులు కార్డులు పొందాలి

రుద్రవరం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు కార్డులను పొందాలని ఏవో సుమతి అన్నారు. మంగళవారం పేరూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, వీఆర్వో నీలకంఠం, ఏఈవో రాజు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

సంజామల, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో సాల్మన్ కోరారు. మంగళవారం కస్తూర్బా బాలికల పాఠశాల, ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయాల ఎదుట మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేశ్వరమ్మ, టీడీపీ నాయకులు మల్కి హుసేన్, మద్దిలేటి, మాధవ, సుబ్బారావు, రవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఇంటి పరిసరాల్లో, పొలాల గట్లపైన మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎంపీడీవో సావిత్రి అన్నారు. దొర్నిపాడు, కొత్తపల్లె, చాకరాజువేముల, ఆయా గ్రామాల్లో ఏపీవో అనిఫా, జడ్పీటీసీ శకుంతల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. దొర్నిపాడు సర్పంచ్ దేవమణి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీను, ఉపేంద్ర, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ డీఎం నిరంకుశ వైఖరికి నిరసన

బనగానపల్లె, జూలై 8, (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ఆర్టీసీ డిపో మేనేజరు రవికిశోర్ ఏకపక్ష నిరంకుశ వైఖరిని నిరసిస్తూ డిపో ఎదుట ఎన్ఎంయూ యూనియన్ నాయకులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి శ్రీనివాసులు, కార్మికులు ఎస్ఎస్‌వలి, జమ్ములయ్య, ఎల్లయ్య, ఓబులేసు, సలాంమియా, ప్రహ్లాద పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ డేను విజయవంతం చేయండి

చాగలమర్రి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈనెల 10న ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల కోరారు. మంగళవారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద హెచ్ఎంలకు హోలిస్టిక్ ప్రోగ్రేస్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని ప్రభు త్వ పాఠశాలల్లో ఈ నెల 10న మెగా పేరెంట్స్, ఉపాధ్యాయుల సమావే శం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో-2 ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవా రం స్థానిక ఆదర్శపాఠశాలలో విద్యార్థుల ప్రోగ్రెస్ రికార్డులను ఉపాధ్యా యులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.